సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025

స్థిరపడ్డాకే.. ప్రేమ, పెళ్లి

యువత ఆలోచనలో మార్పు వస్తోంది. మొదట జీవితంలో స్థిరపడ్డాకే ప్రేమ, పెళ్లిపై ఆలోచనలు చేయాలంటున్నారు. వాలంటైన్స్ డేను పురస్కరించుకుని మెదక్ ప్రభుత్వ డిగ్రీ, సిద్దిపేట ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలల్లోని విద్యార్థులతో 'ప్రేమ పెళ్లి – పెద్దలు కుదిర్చిన పెళ్లి' అనే అంశంపై 'సాక్షి' డిబేట్ నిర్వహించింది. ఈ సందర్భంగా వారి వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు.

వివరాలు 8లో..

న్యూస్‌రీల్

పెండింగ్ బిల్లులు చెల్లించండి

గజ్వేల్: ఉపాధ్యాయ, ఉద్యోగులకు పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్‌లోని ఎస్‌టీఓ కార్యాలయాన్ని సందర్శించి ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. లక్షకు పైబడిన బిల్లులు విడుదల చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు తాళ్ల నాగరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ పాల్గొన్నారు.

పరీక్షల వేళ.. విద్యార్థులకు 'దీవెనలు'

నవోదయలో వినూత్న కార్యక్రమం



హాల్‌టికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాజేందర్

వర్గల్(గజ్వేల్): పరీక్షలంటే విద్యార్థులు ఒకింత ఒత్తిడికి, భయానికి గురవుతుంటారు. భయం పారదోలి, ఒత్తిడిని దూరం చేసేందుకు వర్గల్ నవోదయలో 10వ, 12వ తరగతి విద్యార్థుల కోసం గురువారం 'దీవెన' కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులను కార్యక్రమానికి ఆహ్వానించారు. అధ్యాపకుల సమక్షంలో తల్లిదండ్రులు తమ పిల్లలతో మాట్లాడి వారికి దీవెనలను అందించారు. ఎక్కడో దూరంగా ఉన్న తల్లిదండ్రులతో కాసేపు విద్యార్థులు గడిపారు. విద్యార్థులలో నూతనోత్తేజం కలిగించిన ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు, పెన్నులు అందజేశారు. 'ఆల్ ది బెస్ట్' అంటూ ఆయనతోపాటు, అధ్యాపకులు, తల్లిదండ్రులు విద్యార్థులను వెన్ను తట్టి ప్రోత్సహించారు. కాగా 10వ తరగతి బోర్డు పరీక్షలు ఈ నెల 15న, 12వ తరగతి పరీక్షలు 21న ప్రారంభమవుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

సమ్మక్క జాతర కమిటీ అధ్యక్షుడిగా ముని

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్ళపల్లి గ్రామ సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీ అధ్యక్షుడిగా అర్షనపల్లి ముని ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద గురువారం ఏర్పాటు నిర్వహించిన సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా సత్తయ్య, ఉపాధ్యక్షులుగా రాజమౌళి, వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా అంజయ్యగౌడ్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ముని మాట్లాడుతూ జాతర ఘనంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామన్నారు.

ఉల్లంఘనలే..

బైండోవర్ అయినా మారని తీరు



- బెజ్జంకి మండలం వడ్డెర బస్తీకి చెందిన అరుణను గత ఏడాది గుడుంబా విక్రయిస్తుండటంతో స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అయినా మళ్లీ అదే పని చేయడంతో ఈ నెల 10న బౌండ్‌డౌన్ కింద రూ.లక్ష జరిమానా విధించారు. డబ్బులు చెల్లించకపోవడంతో జైలు శిక్ష విధించారు.
- అక్కన్నపేటకు చెందిన సుగుణ గుడుంబా విక్రయిస్తుండటంతో స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. తిరిగి విక్రయిస్తుండగా పట్టుపడింది. దీంతో ఈ నెల11న తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి రూ.50వేల జరిమానా విధించారు. ఆ డబ్బును సదరు మహిళ చెల్లించారు.

- 2024లో 243 మంది మేజిస్ట్రేట్ ఎదుట హాజరు
- 18 మంది నేరస్తులు, అనుమానితులు అతిక్రమణ
- జరిమానాలు విధిస్తున్న తహసీల్దార్లు

సాక్షి, సిద్దిపేట బైండోవర్ అయిన నేరచరితులు, అనుమానితులు బౌండ్‌డౌన్ అవుతున్నారు. బైండోవర్ సమయంలో రాసిచ్చిన హామీని అతిక్రమిస్తున్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా పండుగలు, ఇతర సందర్భాల్లో కూడా వీరిని బీఎన్ఎస్ 107, 108, 109, 110 సెక్షన్ల కింద బైండోవర్ చేస్తుంటారు. లా అండ్ ఆర్డర్, ఎక్సైజ్ పోలీసులు తహసీల్దారుల ఎదుట బైండోవర్ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 2024లో 243 మందిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 18 మంది బౌండ్‌డౌన్ కావడంతో జరిమానాలు విధించారు. ఒకరికి జైలు శిక్ష వేశారు.

బైండోవర్ అంటే..

ఎన్నికల సమయంలో మద్యం బెల్టుషాప్‌లు, గుడుంబా, రౌడీషీటర్లు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారితో పాటు గొడవలు సృష్టించే అవకాశమున్న వ్యక్తులను సంబంధిత తహసీల్దార్ ఎదుట పోలీసులు హాజరు పరుస్తారు. రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు బాండ్‌పేపర్ రాయించుకుంటారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడబోమని సత్ప్రవర్తనగా ఉంటామని లిఖితపూర్వకంగా హామీ పత్రం రాసి ఇస్తారు. దీనిని బైండోవర్ అంటారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేస్తారు.

ఈ ఏడాది 18 మంది అతిక్రమణ

బైండోవర్ సమయంలో ఇచ్చిన మాటను అతిక్రమించడమే బౌండ్‌డౌన్. వ్యక్తిగతంగా హాజరై రాత పూర్వకంగా ఇచ్చిన హామీని మితిమీరడాన్ని చట్ట ఉల్లంఘనగా పరిగణిస్తారు. బైండోవర్ తరువాత ఆ వ్యక్తి ప్రవర్తనలో మార్పు రాకపోతే సమన్లు జారీ చేసేందుకు, జైలుకు పంపించేందుకు తహసీల్దార్‌కు అధికారం ఉంటుంది. బైండోవర్ అయిన వ్యక్తి చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే గంటల్లోనే అరెస్టు చేస్తారు. బాండ్ విలువకు సమానమైన మొత్తాన్ని అతని నుంచి వసూలు చేస్తారు. అతడు చెల్లించని పక్షంలో పూచీకత్తు ఇచ్చిన వ్యక్తి నుంచి తీసుకొని రాష్ట్ర ఖజానాకు పంపిస్తారు. తరచూ నేరాలు, హత్యలు చేయడం, అల్లర్లు సృష్టించడం, దౌర్జన్యాలకు పాల్పడటం వంటి వారిపై రౌడీషీట్ తెరుస్తారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 18 మంది బౌండ్‌డౌన్ అయ్యారు. వారికి జరిమానాలు ఆయా మండల తహసీల్దార్‌లు విధించారు.

మార్పు రాకపోతే జైలే..



బైండోవర్ అయిన వారి ప్రవర్తనలో మార్పు రాకపోతే జైలు జీవితం తప్పదు. మళ్లీ చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వర్తించకుండా ఉండాలి. గుడుంబా, బెల్ట్ షాప్‌లు నిర్వహిస్తున్నవారే ఎక్కువగా బైండోవర్ అవుతున్నారు. వారిపై నిరంతరం నిఘా ఉంచాం.

– శ్రీనివాస మూర్తి, ఈఎస్, ఎక్సైజ్ శాఖ



అవినీతి అధికారులకు ఝలక్

- ఏసీబీ దాడులతో గుబులు
- ఆర్ఐ నర్సింహారెడ్డి ఇంట్లో నగదు, డాక్యుమెంట్లు స్వాధీనం?
- తహసీల్దార్ కార్యాలయంలోనూ విస్తృత తనిఖీలు

దుబ్బాక: అవినీతి అధికారుల గుండెల్లో ఏసీబీ గుబులు రేపుతోంది. వారసత్వ భూమిపట్టా మార్పు కోసం మహిళా రైతు నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ దుబ్బాక ఆర్ఐ నర్సింహారెడ్డి ఏసీబీ అధికారులకు చిక్కిన విషయం విదితమే. జిల్లాలో ప్రధానంగా రెవెన్యూ, పోలీస్, మున్సిపల్‌తో పాటు పలుశాఖల్లో కొంతమంది అధికారుల తీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాలు వెలుగుచూస్తున్నాయి. తాజాగా సిద్దిపేటలోని ఓ హోటల్‌లో ఆర్ఐ నర్సింహారెడ్డి లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడడం చూస్తుంటే అధికారుల అవినీతి ఎంతగా మితిమీరిపోయిందో అర్థమవుతోంది. జిల్లాలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ శాఖలతో పాటు పలు ఇంజనీరింగ్ శాఖల్లో కొంత మంది అధికారులు ప్రజలు, రైతులు, కాంట్రాక్టర్ల నుంచి లంచాలు గుంజుతున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. తాజాగా ఆర్ఐ వ్యవహారంతో మిగతా వారు తాము ఎక్కడ పట్టుబడుతామో అన్న ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. అన్ని శాఖల్లోనూ ఏసీబీ దాడులపైనే చర్చించుకోవడం కనిపించింది.

తహసీల్దార్ కార్యాలయంలో..

దుబ్బాక తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో అధికారులు బుధవారం రాత్రి 9 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు తనిఖీలు నిర్వహించారు. ఆర్ఐ నర్సింహారెడ్డికి సంబంధించిన ఆఫీసులోని రికార్డులు, కంప్యూటర్ తో పాటు పలు భూములకు ఆయన చేసిన రికార్డు పత్రాలపై పూర్తిస్థాయిలో అన్వేషించినట్లు తెలిసింది. ఏ విషయం కూడా మీడియాకు ఏసీబీ అధికారులు తెలుపక పోవడం శోచనీయం.



దుబ్బాక తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల తనిఖీలు

ఆర్ఐ ఇంట్లో కీలక పత్రాలు స్వాధీనం?

ఆర్ఐ నర్సింహారెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు సోదా చేయగా నగదుతో పాటు సుమారు 30 తులాలకు పైగా బంగారం, పలు ప్లాట్లు, భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆర్ఐ కి సంబంధించిన బ్యాంక్ లాకర్ సీజ్ చేస్తూ నోటీసులు ఇచ్చారని తెలిసింది. బ్యాంక్ లాకర్‌ను రెండు రోజుల్లో తెరవనున్నట్లు తెలిసింది.

గతంలోనూ ఏసీబీ వలలో పలువురు..

గతంలో చాలా మంది ఏసీబీ అధికారులకు చిక్కిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. గతంలో దుబ్బాక పోలీస్‌స్టేషన్‌లో సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ వీరయ్య ఏసీబీ వలలో చిక్కారు. అలాగే ఆర్ఐతో పాటు వీఆర్ఓ, పలువురు రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు సైతం ఏసీబీ కి చిక్కారు. తాజాగా ఆర్ఐ నర్సింహరెడ్డి ఏసీబీ చిక్కడంతో దుబ్బాక మరోసారి రాష్ట్ర వ్యాప్తంగా వార్తల్లోకి ఎక్కింది.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్‌రూరల్: హామీల అమలులో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. పార్లమెంట్ సభ్యుల్లో సగం మందికిపైగా నేర చరిత్ర ఉన్నవారే ఉన్నారని అన్నారు. గురువారం హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ తెచ్చిన కొత్త చట్టాలతో న్యాయం చేస్తారనే నమ్మకం లేదన్నారు. నేర చరిత్ర కలిగిన నాయకులను చట్ట సభలకు రాకుండా అడ్డుకోవాలన్నారు. అప్పుడే ప్రజలకు సుపరిపాలనను అందించిన వారవుతారని అన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి, కల్లబొల్లి హామీలు ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. వివిధ రంగాల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గడిపె మల్లేశం, కొమ్ముల భాస్కర్, సంజీవరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ

వర్గల్(గజ్వేల్): బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ చేయడం లక్ష్యంగా బ్యాంక్ శాఖలు ఏర్పాటు చేస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ కారే భాస్కరరావు తెలిపారు. గురువారం వర్గల్ మండలం తున్కిఖాల్సాలో నూతన బ్యాంక్ శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు, ప్రజలు, మహిళా స్వయం సహాయక సంఘాలు బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలోనే బ్యాంకు ఉండడం వల్ల పొరుగు గ్రామాలకు వెళ్లే అవసరం ఉండదన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకు సేవలు చేరువచేశారని పేర్కొంటూ పలువురు స్థానికులు ఆయనకు జ్ఞాపికలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.



సీజీఎం భాస్కరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న స్థానికులు

ఉపాధి పనుల్లో అక్రమాలు సహించం



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

అదనపు డీఆర్డీఓ బాలకిషన్

చిన్నకోదూరు(సిద్దిపేట): ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే సహించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు డీఆర్డీఓ బాలకిషన్ అన్నారు. గురువారం చిన్నకోదూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 15వ విడత ప్రజా వేదికలో పాల్గొన్నారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలో చేపట్టిన వివిధ రకాల పనులపై తనిఖీ బృందం ప్రజావేదికలో గ్రామాల వారీగా చదివి వినిపించారు. గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీలో పనుల్లో అధికారుల పర్యవేక్షణ లోపించినట్లు, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేనట్లు అధికారులు గుర్తించారు. అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి రూ.69,300 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. అలాగే రికార్డులు సక్రమంగా లేని వారికి రూ. 52 వేలు ఫైన్ విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాస్ గౌడ్, అంబుడ్స్‌మెన్ అరీఫొద్దిన్, ఎంపీడీఓ జనార్దన్, ఎంపీఓ సామిరెడ్డి, ఏపీఓ స్రవంతి, ఈసీ శివకుమార్, టీఏలు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన వాహనాల రద్దీ



జిల్లా కేంద్రంలో రోజు రోజుకు వాహనాల రద్దీ పెరుగుతోంది. దీంతో ప్రధాన రహదారులన్నీ వాహనాల రాకపోకలతో కిటకిటలాడుతున్నాయి. మాఘ మాసం పురస్కరించుకుని వివాహాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా ప్రజలు షాపింగ్ కోసం సిద్దిపేటకు రావడంతో ఇటు వాహనాలు, అటు ప్రజలతో సందడిగా మారింది. – ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- అట్టహాసంగా రాష్ట్ర స్థాయి క్రీడలు ప్రారంభం
- పాల్గొన్న 211 మంది విద్యార్థులు
- 3 రోజుల పాటు నిర్వహణ



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న అధికారులు

సిద్దిపేటరూరల్: విద్యార్థులు క్రీడల్లోనూ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని పాలిటెక్నిక్ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించిన రాష్ట్ర స్థాయి క్రీడలు గురువారం తోర్నాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన జ్యోతిప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు క్రీడలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు వేరే కళాశాలలకు వెళ్లి క్రీడల్లో పాల్గొనడం ద్వారా స్నేహభావం ఏర్పడుతుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. అనంతరం పరిశీలకుడు డాక్టర్ సురేశ్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. 10 వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 211 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటున్నారని తెలిపారు. వాలీబాల్, టేబుల్‌టెన్నిస్, క్యారం, త్రోబాల్, టెన్నికాయిట్, రన్నింగ్, జావెలిన్‌త్రో పాటుగా వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీల్లో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మద్యమండల వ్యవసాయ ఉప సంచాలకులు డా.ఉమారెడ్డి, డీపీఓ రాధిక, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ప్రొఫెసర్లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



చెస్ ఆడుతున్న క్రీడాకారులు

నామినేషనా? కొనసాగింపా..?

- తొమ్మిదింటిలో ఆరు ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ ఛైర్మన్లు బీఆర్ఎస్ వారే..
- ముగ్గురు మాత్రమే కాంగ్రెస్..
- ఈ పాలకవర్గాలపై సర్కారు వైఖరి ఎటువైపో..
- డీసీసీబీలతో పోలిస్తే భిన్నంగా రాజకీయ పరిస్థితులు



ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ కార్యాలయం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జిల్లాల్లో కీలకమైన డీసీఎంఎస్ (జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ)ల పాలక వర్గాల పదవీకాలం విషయంలో సర్కారు నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. తొమ్మిది డీసీఎంఎస్‌లలో ఆరు ఉమ్మడి జిల్లాల ఛైర్మన్లు ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డీసీఎంఎస్‌ల పాలకవర్గాల పదవీకాలాన్ని పొడిగిస్తారా..? లేక నామినేటెడ్ పద్ధతిలో నియమిస్తారా..? అనే దానిపై శుక్రవారం స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికే డీసీసీబీ పాలకవర్గాలకు పదవీకాలం పొడిగించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. అయితే డీసీఎంఎస్‌ల విషయానికి వస్తే రాజకీయంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు డీసీఎంఎస్‌లు మూడు మాత్రమే ఉన్నాయి. నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల డీసీఎంఎస్‌ల ఛైర్మన్లుగా మాత్రమే హస్తం పార్టీ నేతలున్నారు. మిగిలిన అన్ని డీసీఎంఎస్‌ల ఛైర్మన్లు ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో సర్కారు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై చర్చ జరుగుతోంది. ఒకవేళ నామినేట్ చేస్తే అన్ని డీసీఎంఎస్‌లకు చేస్తారా? లేదంటే ప్రస్తుతం ఉన్న పాలకవర్గాన్నే కొనసాగిస్తారా? అనే సస్పెన్స్ ఒకటి రెండు రోజుల్లో వీడనుంది. డీసీసీబీలతో పాటు డీసీఎంఎస్‌ల పదవీకాలం కూడా ఈ నెల 15తో ముగుస్తున్న విషయం విదితమే.

కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు యత్నాలు?

బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న డీసీఎంఎస్ ఛైర్మన్లను కాంగ్రెస్ పార్టీలోకి మార్చేందుకు ఆయా జిల్లాల్లోని కీలక ముఖ్యనేతలు కొంతమేర ప్రయత్నాలు జరిగినట్లు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. డీసీఎంఎస్ ఛైర్మన్లను మల్కాపురం శివకుమార్ (మెదక్), లింగయ్య (ఆదిలాబాద్), శ్రీకాంత్‌రెడ్డి (కరీంనగర్), రామస్వామినాయక్ (వరంగల్), ప్రభాకర్‌రెడ్డి (మహబూబ్‌నగర్), కృష్ణారెడ్డి (రంగారెడ్డి)లు ప్రస్తుతం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. డీసీసీబీ ఛైర్మన్లు పార్టీ మారినట్లు వీరు కాంగ్రెస్‌లో చేరలేదు. ఇప్పుడు వీరి పదవీకాలాన్ని పొడిగింపు విషయానికి వచ్చే సరికి వీరిలో ఒకరిద్దరు పార్టీ మారతారని భావించారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పేందుకు ఆయా జిల్లాల్లోని కీలక కాంగ్రెస్ నేతలు చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. కొన్ని జిల్లాల్లో వీరిని చేర్చుకునే ప్రయత్నమే జరగలేదు. దీంతో వీరంతా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ డీసీఎంఎస్‌ల పాలకవర్గాన్ని నామినేట్ చేస్తారా? లేదంటే వీరినే కొనసాగిస్తారనేదానిపై శుక్ర, శనివారాల్లో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయనే అభిప్రాయం సహకార వర్గాల్లో వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

రెవెన్యూ సర్వేయర్‌పై దాడి

పాపన్నపేట(మెదక్‌): రెవెన్యూ సర్వేయర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటన మండల పరిధిలోని యూసుఫ్‌పేటలో గురువారం చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌ గౌడ్‌ కథనం మేరకు.. సర్వేయర్‌ అహోబిలం శ్రీనివాస్‌ యూసుఫ్‌పేటలోని తీగల మల్లేశం అనే వ్యక్తికి చెందిన భూమిని సర్వే చేయడానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా గ్రామ బస్‌ స్టాండ్‌ సమీపంలో అదే గ్రామానికి చెందిన ఏర్పుల శ్రీనివాస్‌, ఏర్పుల గంగయ్య సర్వేయర్‌ బైక్‌ ఆపి బూతులు తిడుతు దాడి చేశారు. హెల్మెట్‌తో కొట్టారు. సర్వేయర్‌ ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


క్రీడాకారిణి రాణి

గజ్వేల్‌: జాతీయస్థాయి సీనియర్‌ మహిళా కబడ్డీ పోటీలకు తొగుట మండల వరదరాజ్‌పల్లి గ్రామానికి చెందిన బొంగోని రాణి ఎంపికైనట్లు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి, అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్‌, ప్రధాన కార్యదర్శి శివకుమార్‌ తెలిపారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 14 నుంచి 18 వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కబడ్డీ సీనియర్‌ మహిళల విభాగంలో సిద్దిపేట జిల్లా నుంచి క్రీడాకారిణి ఎంపిక కావడం ఇది తొలిసారి అని పేర్కొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్‌: వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు ఎండు గంజాయిని పట్టుకున్న ఘటన పటాన్‌చెరు ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎక్సైజ్‌ సీఐ పరమేశ్వర్‌ గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం లక్డారం ఎక్స్‌రోడ్‌లో బుధవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించాం పటాన్‌చెరుకు చెందిన అఖిల్‌, శశాంక్‌ రెడ్డి నుంచి 500 గ్రాముల ఎండు గంజాయిని, రెండు సెల్‌ఫోన్లను, బైక్‌ని స్వాధీనం చేసుకున్నాం పట్టుబడిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్‌ ఎస్‌ఐ రాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్‌లు సీజ్‌


ఇసుకను స్వాధీనం చేసుకున్న అధికారులు

పాపన్నపేట(మెదక్‌): అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను గురువారం సీజ్‌ చేసినట్లు ఆర్‌ఐ నాగరాజు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎంకెపల్లి గ్రామంలో వెళ్లి చూడగా మంజీరా నది తీరంలోని పలు పొలాలు, ఇళ్ల మధ్యన సుమారు 15 ట్రాక్టర్ల ఇసుక నిల్వ ఉంది. ఈ మేరకు స్థానిక ఏఎస్‌ఐ సంగన్న, పోలీసు సిబ్బంది సహాయంతో మొత్తం నాలుగు డంప్‌లను స్వాధీన పర్చుకున్నామన్నారు. అధికారుల సూచన మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

స్థిరపడ్డాకే.. ప్రేమ–పెళ్లి

యువత ఆలోచనా విధానాల్లో రోజురోజుకూ మార్పు వస్తోంది. గతంలో దూకుడు కనిపించడమే కాక చిన్న విషయానికైనా తల్లిదండ్రులను ఎదురించాలనే ధోరణి ఉండేది. చదువుకుంటూనే ప్రేమించడం, జీవితంలో స్థిరపడకముందే అందరినీ ఎదురించి పెళ్లి చేసుకోవడం సాధారణంగా కనిపించేది. కానీ ప్రస్తుత యువతలో చదువు, ఆపై ఉద్యోగంతో జీవితంలో స్థిరపడటమే ప్రధానమనే భావన వ్యక్తమవుతోంది. ఆ తర్వాత ప్రేమ, పెళ్లి ఆలోచనలు చేయాలని చెబుతున్నారు. నేడు వాలంటైన్స్‌ డే సందర్భంగా గురువారం మెదక్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, సిద్దిపేట ఇందూరు ఇంజినీరింగ్‌ కళాశాలలో సీఎస్‌ఈ, ఈఈఈ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో 'ప్రేమ పెళ్లి – పెద్దలు కుదిర్చిన పెళ్లి' అనే అంశంపై 'సాక్షి' డిబేట్‌ నిర్వహించింది. కార్యక్రమంలో 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా అందులో 99 శాతం విద్యార్థులు పెద్దలు కుదిర్చిన పెళ్లికే ఓటు వేశారు.

– మెదక్‌జోన్‌/సిద్దిపేట అర్బన్‌




సిద్దిపేటలోని ఇందూరు ఇంజినీరింగ్‌ కళాశాల విద్యార్థులు


మెదక్‌ జోన్‌ : డిబేట్‌లో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

జీవితంలో స్థిరపడ్డాకే..



ప్రేమ పెళ్లి అయినా.. పెద్దలు కుదిర్చిన పెళ్లి అయినా జీవితంలో స్థిరపడ్డాకే చేసుకోవడం ఉత్తమం. ప్రేమ పెళ్లి తప్పుకాదు. ఇరు కుటుంబాలను ఒప్పించి చేసుకోవాలి. ఇందుకోసం ప్రధాన ఆయుధం జీవితంలో స్థిరపడటమే. తల్లిదండ్రులను బాధ పెట్టొద్దు. మనపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారు.

– హారిక, బీకామ్‌, థర్డ్‌ ఇయర్‌

చదువే ప్రధాన లక్ష్యం



ఎంచుకున్న లక్ష్యం నెరవేరాలంటే ముందు చదువుపై దృష్టి పెట్టాలి. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. పెళ్లికి ముందు ఉన్న ప్రేమ పెళ్లి అనంతరం ఉండటం లేదు. ప్రేమ పెళ్లిళ్లు చాలా వరకు ఫెయిల్‌ అవుతున్నాయి. కొంతమంది మాత్రమే సక్సెస్‌ అవుతున్నారు.

–భాను ప్రసాద్‌, బీకామ్‌, థర్డ్‌ ఇయర్‌

అమ్మానాన్నల ఆశీస్సులతోనే..



ఎన్నో త్యాగాలు చేసి విద్యావంతులుగా తీర్చిదిద్దిన అమ్మానాన్నలను మర్చిపోవద్దు. ప్రేమిస్తే తల్లిదండ్రులను బాధ పెట్టకుండా ఒప్పించి పెళ్లి చేసుకోవాలి. అప్పుడే జీవితంలో రాణించగలం. ఏ ఆపద వచ్చినా..అమ్మానాన్నలు అండగా ఉంటారనే మనోధైర్యం ఉంటుంది. వారు మనకు తోడుగా ఉంటారు.

– ప్రసన్నలక్ష్మి, బీకామ్‌

అవగాహన అవసరం



ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకుంటే ఇద్దరి మధ్య అవగాహన చాలా అవసరం. చాలా మంది కేవలం ఆకర్షణకు లోనై ప్రేమ అనే భ్రమలో పడి పెళ్లి చేసుకుంటూ అగాధంలో కూరుకుపోతున్నారు. అలా కాకుండా ఒకరినొకరు అర్థం చేసుకొని అనుకున్న లక్ష్యం నెరవేరాక ప్రేమ పెళ్లి చేసుకోవాలి.

– రాజేంద్ర, బీకామ్‌

చదువు నిర్లక్ష్యం చేయొద్దు



ప్రేమ పేరుతో చదువును నిర్లక్ష్యం చేయొద్దు. జీవితంలో వెలుగు నింపే చదువును పక్కనబెట్టి ప్రేమపేరుతో వెంటపడి వేధించి బాధించడం సరికాదు. నిన్ను ఇష్టపడ్డ వారినే ఇష్ట పడాలి. బలవంతంగా ఇతరులను ఇబ్బందులను గురిచేస్తే ఇద్దరి చదువుతోపాటు జీవితాలు నాశనం అవుతాయి.

–నాగ మల్లీశ్వరి, బీకామ్‌

లక్ష్యం సాధించాకే..



జీవితంలో అనుకున్న లక్ష్యం సాధించాకే లవ్‌ జోలికి వెళ్తే బెటర్‌. కులాంతర వివాహాల వల్ల హత్యలు, ఆత్మహత్యలు జరుగుతూనే ఉన్నాయి. ఇద్దరు ఇష్టపడితే ముందు వారు ఎంచుకున్న లక్ష్యం సాధించాక పెళ్లి చేసుకోవాలి. లేదంటే కుటుంబీకుల నుంచి వ్యతిరేకత రావడం జరుగుతుంది.

– రాజు, బీకామ్‌

పెద్దల అండ అవసరం..



పెద్దలను కాదని ప్రేమ పెళ్లి చేసుకున్న వారికి ఏదైనా సమస్య కానీ ఆపద కానీ వస్తే పెద్దలు సహకరించే పరిస్థితి ఉండదు. అదే పెద్దలు కుదిర్చిన పెళ్లి అయితే ఏ సమస్య వచ్చినా మన వెనుక నిలబడి సమస్యను పరిష్కరిస్తారు. వారి సపోర్ట్‌తో ముందుకెళ్లవచ్చు.

– లోకేశ్‌ బాబు, విద్యార్థి

ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాలి



లోకేశ్‌ చెప్పినట్లు పెద్దలు కుదిర్చిన పెళ్లే బాగుంటుంది. ప్రేమ పెళ్లి అయితే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అదే పెద్దలు కుదిర్చిన పెళ్లి అయితే ఆర్థిక స్థిరత్వం ఉండేలా వారి తోడ్పాటు ఉంటుంది. ఏ ఇబ్బంది లేకుండా జీవితాన్ని లీడ్‌ చేయొచ్చు. ప్రేమ పెళ్లిలు చేసుకున్న వారు పెళ్లి తర్వాత ముందు ఉన్నంత ప్రేమగా ఉండడం లేదు.

–ఐశ్వర్య, విద్యార్థిని

మనస్పర్థలు వస్తాయి



పెద్దలు కుదిర్చిన పెళ్లి అయితే కాబోయే వ్యక్తి ఎలాంటి వాడు అనే విషయాలు ఏవీ తెలియకుండా అతడితో జీవితాన్ని పంచుకోవాలి. అదే లవ్‌ మ్యారేజ్‌ అయితే ఒకరినొకరం తెలుసుకొని అభిప్రాయాలు పంచుకుంటాం. అందువల్ల భవిష్యత్‌లో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చే అవకాశం తక్కువ ఉంటుంది.

– మధురిమ, విద్యార్థిని

కులాలు అంతమవుతాయి



ప్రస్తుతం ఎక్కడ చూసినా క్యాస్ట్‌ ఫీలింగ్‌ ఉంది. పెద్దలు కుదిర్చిన పెళ్లి వల్ల కులాల ప్రస్తావన ఎప్పటికీ అలాగే కొనసాగుతుంది. అదే ప్రేమ పెళ్లిలు చేసుకుంటే కొన్ని తరాల తర్వాత కులాల ప్రస్తావన లేకుండా పెళ్లిలు జరిగే అవకాశం ఉంటుంది. క్యాస్ట్‌ ఫీలింగ్‌ పోతుంది అని నా భావన.

– అజయ్‌, విద్యార్థి

తల్లిదండ్రుల గౌరవాన్ని కాపాడాలి



జీవితం అంటే ఏంటో తెలియని వయస్సులో ప్రేమ, పెళ్లి అని తిరగకుండా ప్రేమ, ఆకర్షణకు తేడా తెలుసుకోవాలి. పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులకు మన గురించి మన కంటే ఎక్కువ తెలుసు. వారి గౌరవాన్ని కాపాడే విధంగా ప్రేమ జోలికి పోకుండా జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి చేసుకోవాలి. అది కూడా పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవాలి. ఇరు కుటుంబాల పెద్దలు అండగా ఉంటే ధైర్యంగా ఉంటుంది.

– శైలజ, విద్యార్థిని

పెద్దలను ఒప్పించి చేసుకోవాలి



ప్రేమ పెళ్లి చేసుకోవాలనుకుంటే ముందుగా పెద్దలను ఒప్పించి చేసుకోవాలి. అలా అయితేనే జీవితం బాగుంటుంది. తల్లిదండ్రులను కాదని ప్రేమ పెళ్లి చేసుకోవడం వల్ల ఫ్యామిలీ సపోర్ట్‌కు దూరమవుతాం. పెద్దలను కాదని ప్రేమ పెళ్లి చేసుకొని సాధించేది ఏం ఉండదు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఎవరి సపోర్టు ఉండదు. ముందుగా జీవితంలో బాగా స్థిరపడా లి. అప్పుడే లైఫ్‌ బాగుంటుంది.

– లోకేశ్‌, విద్యార్థి

ఇన్‌స్టాగ్రామ్‌ కలిపింది



రేగోడ్‌(మెదక్‌): ఆమె పెళ్లే చేసుకోవాలనుకోలేదు.. కానీ ఇన్‌స్టాగ్రామ్‌ పెళ్లి చేసుకునేలా చేసింది. ఒక అబ్బాయితో ప్రేమలో పడేసి ఇద్దరినీ కలిపింది. ఫ్రెండ్స్‌గా ప్రేమతో పెళ్లి పీటల వరకూ వెళ్లింది. పెద్దలు వద్దన్నా.. ఇరువైపులా ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. జిల్లాలోని రేగోడ్‌ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న పూజ తన ప్రేమ వివాహ మధురమైన జ్ఞాపకాలను గురువారం సాక్షితో పంచుకుంది. నేను పెళ్లే చేసుకోవాలనుకోలేదు. కానీ లాయర్‌ చదువుకునే రోజుల్లో 2018లో ఇన్‌స్టాగ్రామ్‌లో విక్రమ్‌ రాథోడ్‌ పరిచయమై ఫ్రెండ్స్‌గా ప్రేమలో పడ్డాం. మొదట పరిచయమవగానే ఇన్‌స్టాలో డైరెక్ట్‌గా పెళ్లి చేసుకుందామని నేనే ముందుగా ప్రపోజ్‌ చేశా. తను ఒప్పుకున్నా.. రెండు వైపులా పెద్దలు ఒప్పుకోలేదు. వారిని ఒప్పించడానికి చాలా కష్టపడ్డాం. అందరూ ఒప్పుకోవడంతో 2020 డిసెంబర్‌లో పెళ్లి చేసుకున్నాం. ప్రస్తుతం ఒక బాబుతో మా ఫ్యామిలీతో ఆనందంగా ఉన్నాం.

– పూజ, విక్రమ్‌ రాథోడ్‌

లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి

– సిద్దిపేట సీపీ అనురాధ



సిద్దిపేటకమాన్‌: యువత జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, ఉన్నత చదువులు చదివి గొప్పగా స్థిరపడాలి. ప్రేమపేరుతో యువత జీవితాలను నాశనం చేసుకోవద్దు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ప్రణాళికతో కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలి. తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలి. ప్రేమ, పెళ్లి పేరుతో విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దు.

రేషన్‌ బియ్యం అమ్మితే కఠిన చర్యలు

- సివిల్‌ సప్లయ్‌ కార్పొరేషన్‌ అధికారి శశిధర్‌ రాజు
- రామారం గ్రామంలో 431 క్వింటాళ్ల బియ్యం పట్టివేత


రైసుమిల్లులో అధికారులతో కలిసి మాట్లాడుతున్న శశిధర్‌ రాజు

దుబ్బాకటౌన్‌: ప్రభుత్వం నిరుపేదలకు అందజేస్తున్న రేషన్‌ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు కొనుగోలు చేసి రీసైక్లింగ్‌ చేసి మళ్లీ ప్రభుత్వానికి అందిస్తున్నారని, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర చీఫ్‌ విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌, సివిల్‌ సప్లయ్‌ కార్పొరేషన్‌ అధికారి శశిధర్‌ రాజు అన్నారు. సివిల్‌ సప్లయ్‌ కమిషనర్‌ ఆదేశాల మేరకు, నమ్మదగిన సమాచారంతో రాయపోల్‌ మండలం రామారం గ్రామ శివారులో సాయి మహాదేవ్‌ ఆగ్రో ఇండస్ట్రీస్‌ రైస్‌ మిల్లులో విజిలెన్స్‌, ఎన్‌ఫోర్స్‌మెంట్‌, ట్రాన్స్‌కో అధికారులు స్థానిక పోలీసులతో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రూ.15.5 లక్షలు విలువ గల దాదాపు 431 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్‌ బియ్యం అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సాయి మహదేవ్‌ మిల్లు ప్రభుత్వానికి 1,660 టన్నుల బియ్యం బాకీ ఉండడంతో దాదాపు రెండు సీజన్లు ప్రభుత్వం సీఎంఆర్‌ ఇవ్వలేదన్నారు. గుట్టుగా ఇతర వాహనాల నుంచి రేషన్‌ బియ్యం తీసుకొచ్చి మళ్లీ వాటిని రీసైక్లిలింగ్‌ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వాన్ని రెండు రకాలుగా మోసం చేస్తున్నారన్నారు. రీసైక్లింగ్‌ చేసిన బియ్యాన్ని కామారెడ్డి, హన్మకొండ, సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూరు మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మిల్లు లీజుకు తీసుకొని నడిపిస్తున్న సాయి కుమార్‌ రెడ్డి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పట్టుపడిన బియ్యాన్ని దౌల్తాబాద్‌ పౌర సరఫరాల గోదాముకు తరలించామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ తనుజ, ఎస్‌ఐ ప్రేమదీప్‌, తదితర అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్తుల చెరలో దొంగలు

- నెల రోజులుగా ఇళ్లల్లో వరుస చోరీలు
- నగదు, బంగారం అపహరణ
- పట్టుకొని పోలీసులకు అప్పగించిన పెద్దారెడ్డి పేట యువకులు


గ్రామస్తులు పట్టుకున్న దొంగలు

పుల్‌కల్‌(అందోల్‌): నెల రోజులుగా మూడు గ్రామాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను గురువారం రాత్రి పెద్దారెడ్డిపేట యువకులు పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. నేరడిగుంట చౌరస్తాలో గురువారం రాత్రి ఓ హోటల్‌లో చోరీకి ప్రయత్నించారు. అక్కడ ఏం దొరక్కపోవడంతో రెండు వంట గ్యాస్‌ సిలిండర్‌లను దొంగిలించి పెద్దారెడ్డిపేట వైపు బైక్‌పై వెళ్తున్నారు. అక్కడి వారు పెద్దారెడ్డిపేట గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామ యువకులు ఏకమై బైక్‌లపై వస్తున్న దొంగలను మాటువేసి పట్టుకున్నారు. వీరు నెల రోజుల నుంచి పెద్దారెడ్డిపేటలో 5 ఇళ్లలో, రాయిపాడు, మంతూరులో రెండేసి ఇళ్లలో దొంగతనం చేశారని గ్రామస్తులు పోలీసులకు తెలిపారు. దొంగతనం జరిగిన ఇళ్లలో బంగారం, నగలు, నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ విషయంపై పుల్‌కల్‌ ఎస్‌ఐ క్రాంతి కుమార్‌ను వివరణ కోరగా దొంగలను జోగిపేట సీఐకి సరెండర్‌ చేశామని తెలిపారు. సీఐ విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

వేధింపులతోనే నా భర్త ఆత్మహత్య

రమేశ్‌ బలవన్మరణంపై భార్య పోలీసులకు ఫిర్యాదు


ఫిర్యాదు కాపీని చూపుతున్న గాయత్రి

మెదక్‌ మున్సిపాలిటీ: అప్పుల వారి వేధింపులు తట్టుకోలేకనే నా భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని మల్లికార్జున రమేశ్‌ భార్య గాయత్రి గురువారం మెదక్‌ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సూపర్‌ మార్కెట్‌ నిర్వహణకు రమేశ్‌ 30 మంది నుంచి దాదాపు రూ.30 కోట్ల వరకు అప్పు తీసుకున్నట్లు తెలిపారు. 11న ఉదయం ఇంటి వద్ద నుంచి సూపర్‌ మార్కెట్‌కు వెళ్లగా అక్కడికి కొందరు అప్పుల వాళ్లు వచ్చి డబ్బులు వెంటనే చెల్లిస్తావా? చస్తావా? లేకుంటే చంపుతామంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి వేధింపులు తట్టుకోలేక సూపర్‌ మార్కెట్‌ పెంట్‌హౌస్‌పై రమేశ్‌ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా ఆ రోజు ఎవరెవరు వచ్చి బెదిరించారో వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

షూటింగ్‌ సందడి


షూటింగ్‌లోని ఓ సన్నివేశం

జోగిపేట(అందోల్‌): నటీనటులు సత్య వినుకొండ, అనుశ్రీ హీరో హీరోయిన్లుగా ఎస్‌ఎస్‌ మూవీ కార్పొరేషన్‌ బ్యానర్‌లో రూపొందుతున్న 'వాషింగ్టన్‌ సుందర్‌' సినిమా షూటింగ్‌ను గురువారం జోగిపేట ప్రాంతంలో నిర్వహించారు. కొంత మంది నటులు మద్యం సేవిస్తున్నట్లుగా, ఒక ఇంటికి సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రంలో జోగిపేట పరిసర ప్రాంత నటులు కూడా నటించడం విశేషం. షూటింగ్‌ జరుగుతున్నట్లు తెలుసుకున్న స్థానికులు తిలకించేందుకు భారీగా తరలివచ్చారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్ట్‌

నర్సాపూర్‌ రూరల్‌: దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నర్సాపూర్‌ సీఐ జాన్‌ రెడ్డి గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. నర్సాపూర్‌ మండలం ఎర్రకుంట తండాకు చెందిన మూడవత్‌ శ్రీను, భార్య శాంతి, కుమారుడు అఖిల్‌ కలిసి 1వ తేదీన ఇంటికి తాళం వేసి వంట చెరుకు కోసం అడవికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన ఓ వ్యక్తి ఇంటి తలుపులు ధ్వంసం చేసి బీరువాలోని రూ.2.60 లక్షలు నగదు, వెండి గొలుసులు ఎత్తుకెళ్లాడు. బాధితుడు శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. గురువారం నమ్మదగిన సమాచారం మేరకు శ్రీనుకు చిన్నాన్న అయిన మూడవత్‌ అంజ్యను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి నగదు, గొలుసులు స్వాధీనం చేసుకొని అంజ్యను కోర్టుకు రిమాండ్‌ చేసినట్లు సీఐ జాన్‌ రెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి

నర్సాపూర్‌ రూరల్‌: ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఖాజీపేటలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొత్తగొండ్ల దశరథ గౌడ్‌ (32) గురువారం గ్రామ సమీపంలోని వీరయ్య కుంట వద్దకు మలవిసర్జన కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందినట్లు తెలిపారు. అటుగా వెళ్లిన గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని దశరథ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నర్సాపూర్‌ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కూటీ పైనుంచి పడి వ్యక్తి..

సదాశివపేట రూరల్‌ (సంగారెడ్డి): స్కూటీ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఎల్లారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. గురువారం సీఐ మహేశ్‌ గౌడ్‌ కథనం మేరకు.. మండలంలోని యెట్టిగడ్డ సంఘం గ్రామానికి చెందిన బంటు శంకరయ్య(49) వ్యవసాయం చేస్తుంటాడు. 12న మునిపల్లి మండలంలోని మల్లికార్జునపల్లిలో బంధువుల ఇంటికి శుభకార్యానికి స్కూటీపై వెళ్లాడు. తిరిగి గ్రామానికి వస్తుండగా అల్లాపూర్‌ గ్రామ శివారులో మొదటగా అదుపుతప్పి పడటంతో గాయాలు అయ్యాయి. అదే గాయాలతో ఎల్లారం మీదుగా ఆత్మకూర్‌ వెళ్లే మట్టి రోడ్డులో గంగాకత్వ కాల్వకు సమీపంలో మరోసారి కిందపడటంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

తిరుమలలో సంగారెడ్డి జిల్లావాసి మృతి

సంగారెడ్డి క్రైమ్‌: తిరుమల దైవదర్శనానికి వెళ్లిన సంగారెడ్డి జిల్లా మహిళ అనుమానాస్పద స్థితిలో అక్కడ మృతి చెందారు. పట్టణ సీఐ రమేశ్‌ కథనం మేరకు.. పట్టణంలోని ఎల్‌ఆర్‌ కాలనీకి చెందిన నడిమిది రవి, అరుణ జ్యోతి(29) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అరుణ జ్యోతి 6వ తేదీన తిరుమల దైవ దర్శనానికి ఒంటరిగా వెళ్లింది. తిరుమల పరిధిలోని ఓ కాల్వలో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ విషయాన్ని తిరుమల పోలీస్‌లు 12న (బుధవారం) భర్త రవికి ఫోన్‌ చేసి చెప్పారు. దీంతో ఆందోళన చెందిన రవి గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పూర్తి వివరాలు తెలుసుకుంటామని పేర్కొన్నారు.